స్వచ్ఛతతోనే సంపూర్ణ ఆరోగ్యం



రామంతాపూర్: ఓల్డ్ రామంతాపూర్‌లోని ప్రభుత్వ జిల్లా పరిషత్ పాఠశాలలో కేంద్రప్రభుత్వ జీఎస్టీ ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. గురువారం జరిగిన కార్యక్రమంలో భాగంగా పలువురు మాట్లాడుతూ.. దైనందిన జీవితంలో పరిశుభ్రత, స్వచ్ఛత పాటిస్తే ఆరోగ్యంతో పాటు ఆత్మవిశ్వాసం పెరుగుతుందన్నారు. బాలల సాహిత్య అవార్డు గ్రహీత వెంకటరమణ, జీఎస్టీ కమిషనర్ శ్రీనివాస్‌తో పాటు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీలత పాల్గొన్నారు.

సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులుగా యాదయ్యగౌడ్



గౌతంనగర్: సీపీఐ మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కార్యవర్గసభ్యులుగా యాదయ్యగౌడ్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో ప్రజాసమస్యలు పరిష్కరించడానికి ఉద్యమాలు, పోరాటాలు నిర్వహిస్తానన్నారు. పార్టీ తనపై నమ్మకం ఉంచి పదవీబాధ్యతలు అప్పగించినందుకు ప్రతిఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.

రాష్ట్రవ్యాప్త బంద్‌ను విజయవంతం చేయాలి

మల్కాజిగిరి: 42శాతం బీసీలకు రిజర్వేషన్లు చట్టబద్ధం చేయాలని డిమాండ్ చేస్తూ.. బీసీ సంఘాలు చేపట్టిన రాష్ట్రబంద్‌ను విజయవంతం చేయాలని సీపీఎం మల్కాజిగిరి మండల కార్యదర్శి గుంటి లక్ష్మణ్, సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు కాసర్ల నాగరాజు పిలుపునిచ్చారు. ప్రజలు కూడా పెద్దఎత్తున బంద్‌లో స్వచ్ఛందంగా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

కుమార్తె ప్రేమ వివాహం చేసుకుంటుందని..

అదృశ్యమైన తల్లి



అరుణ

ఉప్పల్: కుమార్తె ప్రేమ వివాహం చేసుకుంటుందని తల్లి అదృశ్యమైన ఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అబ్దుల్లాపూర్‌మెట్ ప్రాంతానికి చెందిన నర్సింహ్మారెడ్డి భార్య అరుణ(46) గృహిణి. కాగా వీరికి ఓ కుమార్తె, కుమారుడు సంతానం. కాగా కుమార్తె కెనడాలో ఉద్యోగం చేస్తుంది. ఆమె వ్యక్తిని ప్రేమించి, అతడితో ఈనెల 26న వివాహం నిశ్చయం చేసుకుంది. ఈ విషయం తెలుసుకున్న తల్లి అరుణ కుమార్తె వివాహాన్ని అంగీకరించలేదు. దీంతో తల్లీకుమార్తెల మధ్య వాగ్వివాదం పెరిగింది. ఈ విషయంపై మాట్లాడేందుకు చిలుకానగర్‌లో నివాసం ఉండే అరుణ అక్క ఇంటికి ఇద్దరు కలిసి వచ్చారు. అక్కడ కూడా తల్లీకుమార్తెల మధ్య మళ్లీ వాగ్వివాదం జరగడంతో మనస్తాపానికి గురైన తల్లి తాను ఇంటి నుంచి వెళ్లిపోతున్నానని చెప్పి, తిరిగి రాలేదు. దీంతో ఆందోళనకు గురైన కుటుంబసభ్యులు పలుచోట్ల వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో భర్త నర్సింహ్మారెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రభుత్వ శాఖల పేర్లు చెప్పి మోసం..

నిందితుడి రిమాండ్

మేడిపల్లి: వివిధ ప్రభుత్వశాఖల పేర్లు చెప్పి ప్రైవేట్ ఆసుపత్రులు, పలు విద్యాసంస్థల యజమానులను బెదిరిస్తూ.. వసూళ్లకు పాల్పడుతున్న ఓ వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటన మేడిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బెల్లంపల్లి మంచిర్యాల జిల్లాకు చెందిన మహమ్మద్ ఓజియార్ (36) ఘట్‌కేసర్ మండలం కాచవాని సింగారం మణిదీపకాలనీలో నివాసం ఉంటూ.. ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. గత కొన్నాళ్ల నుంచి నగరంలోని పలు ప్రైవేట్ విద్యాసంస్థలు, ఆసుపత్రుల యజమానుల వద్దకు వెళ్లి జీహెచ్‌ఎంసీ, ఎన్‌హెచ్‌ఓ, ఫైర్ డిపార్ట్‌మెంట్‌కు చెందిన అధికారినని, అనుమతి పత్రాలు, ఎన్‌ఓసీలు సరిగ్గా లేవని డబ్బులు డిమాండ్ చేస్తున్నాడు. గురువారం మేడిపల్లిలోని ప్రజ్వల ఆసుపత్రి వద్దకు వెళ్లి అనుమతి పత్రాలు సరిగా లేవని డబ్బులు డిమాండ్ చేయడంతో వెంటనే ఆసుపత్రి సిబ్బంది మేడిపల్లి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు మహమ్మద్ ఓజియర్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. గతంలో ఇతనిపై వివిధ పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదైనట్లు పోలీసులు వివరించారు.

సమస్యల సుడిలో ఎన్నాళ్లు ?

పూర్తిగా ధ్వంసమైన 30 ఫీట్ల రోడ్డు
- నిరుపయోగంగా మారిన కమ్యూనిటీ భవనం
- లో వోల్టేజీ, తాగునీటి సమస్యలతో నిత్యం సతమతం



కూల్చివేసి వదిలేసిన కమ్యూనిటీహాల్



30 ఫీట్ల రోడ్డుపై దెబ్బతిన్న మ్యాన్‌హోల్

కుషాయిగూడ: 2002లో ఏర్పాటైన మీర్‌పేట్–హెచ్‌బీకాలనీ డివిజన్, కైలాసగిరి కాలనీవాసులు సమస్యల సుడిలో కొట్టుమిట్టాడుతున్నారు. అప్పట్లో జిల్లా మంత్రిగా ఉన్న దేవేందర్‌గౌడ్ ఆధ్వర్యంలో ప్రభుత్వభూమిలో లే అవుట్ చేసి, పేదలకు ఇళ్ల స్థలాలను పంపిణీ చేశారు. నాటి నుంచి నేటి వరకు కాలనీలో పూర్తిస్థాయిలో మౌలికవసతులు కల్పించడంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు విఫలమయ్యారని స్థానికులు ఆరోపిస్తున్నారు. చాలా రోజుల క్రితం వేసిన 30 పీట్ల రోడ్డు పూర్తిగా దెబ్బతింది.

నిరుపయోగంగా కమ్యూనిటీహాల్..

ప్రజల అవసరాల కోసం నిర్మించిన కమ్యూనిటీహాల్ నిరుపయోగంగా మారింది. కాలనీలో కలుషిత తాగునీరు, లో వోల్టేజీ సమస్యలతో నిత్యం సతమతమవుతున్నామంటూ.. కాలనీవాసులు వాపోతున్నారు.

ఇళ్ల అసెస్‌మెంట్ మరో సమస్య..

చాలా ఏళ్ల క్రితం వేసిన రోడ్డు పూర్తి స్థాయిలో గుంతలమయంగా మారింది. రోడ్డు కింది భాగమంతా చాలాచోట్ల పందికొక్కులు తవ్వేయడంతో సీసీరోడ్డు డొప్పగా మారింది. భారీ వాహనాలు రోడ్డుపై నుంచి వెళ్తే రోడ్డు కుంగిపోయే ప్రమాదం ఉంది.

కూల్చేశారు.. వదిలేశారు..

ఇక కాలనీలో తాత్కాలికంగా రేకులతో ఏర్పాటు చేసుకున్న కమ్యూనిటీ భవనాన్ని కూల్చేసి వదిలేశారు. దీంతో కాలనీలో కమ్యూనిటీహాల్ లేకుండా పోయింది. ఎన్నికల సమయంలో నాయకులు హామీలిచ్చిన కమ్యూనిటీహాల్ నిర్మాణం ముందుకు సాగడం లేదంటున్నారు. ఏదైనా కాలనీ సమస్యలు, అభివృద్ధి వంటి అంశాలపై చర్చించుకుందామనుకున్నా.. కనీసం నీడ లేకుండా పోయిందంటున్నారు.

కలుషిత నీటి సరఫరా..

కాలనీలో తరచుగా కలుషిత తాగునీరు సరఫరా అవుతోంది. బురద రంగులో వచ్చే నీటిని తాగుతూ.. ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారు. రక్షిత తాగునీరు సరఫరా జరిగేలా చూడాలని కాలనీవాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

750కి పైగా కుటుంబాలు నివాసం..

సుమారు కాలనీలో 750కి పైగా కుటుంబాలు నివాసం ఉంటాయి. కాలనీ మొత్తంలో రెండు ట్రాన్స్‌ఫార్మర్లు మాత్రమే ఉండటంతో తరచుగా కాలనీలో లో వొల్టేజీ సమస్య తలెత్తుతోంది. విద్యుత్ వినియోగం పెరిగితే ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోవడం, అధికారుల చుట్టూ తిరగడం వంటి ఇబ్బందులు పడుతున్నారు. పెరుగుతున్న విద్యుత్ వినియోగానికి తగినట్లుగా ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసి విద్యుత్ సమస్యకు పరిష్కరించాలని కోరుతున్నారు.

ట్యాక్స్‌లు కట్టేందుకు సిద్ధంగా ఉన్నాం..

ఇక కాలనీలో మరో ప్రధాన సమస్య ఇళ్ల అసెస్‌మెంట్. చాలా రోజులుగా తమ స్థలాలను అసెస్‌మెంట్ చేస్తే ట్యాక్సులు కట్టుకుంటామని స్థానికులు అంటున్నారు.

హామీలు మరిచిన నేతలు



ప్రజల అవసరాలకు రేకులతో ఏర్పాటు చేసుకున్న కమ్యూనిటీహాల్‌ను కూలిచ్చేసి వదిలేశారు. ఎన్నికల సమయంలో నేతలు వాగ్దానాలు చేసి కూల్చివేసి మరిచిపోయారు. ప్రజా ప్రతినిధులు స్పందించి కమ్యూనిటీహాల్ నిర్మాణం చేపట్టాలి.

– జిల్లపల్లి యాదగిరి, స్థానికుడు

అధికారులు చొరవ తీసుకోవాలి



కైలాసగిరిలో నెలకొన్న సమస్యలపై అధికారులు చొరవచూపాలి. ప్రధానంగ ధ్వంసమైన 30 పీట్ల రోడ్డుకు తక్షణ మరమత్తులు చేయాల్సిన అవసరం ఉంది. చాలా రోజులుగా వేచిచూస్తున్న అసెస్‌మెంట్ సమస్యపై ప్రజా ప్రతినిధులు, అధికారులు చొరవచూపాలి. ట్యాక్సులు కట్టుకునేందుకు సిద్ధంగా ఉన్నాం.

– దుర్గయ్య, కాలనీ మాజీ అధ్యక్షుడు

కార్తీక మహోత్సవాలకు ఆహ్వానం

మల్కాజిగిరి: కీసరగుట్టలో జరిగే కార్తీకమాస మహోత్సవాలకు రావాలని రాష్ట్ర ఐటీశాఖమంత్రి జిల్లా ఇన్‌చార్జ్ శ్రీధర్‌బాబును కీసరగుట్ట దేవాలయం ట్రస్ట్‌బోర్డు సభ్యుడు బొనగిరి సురేష్‌యాదవ్ ఆహ్వానించారు. గురువారం ఆయనను కలిసి ఆహ్వానపత్రికను అందజేశానని తెలిపారు.

బంద్‌కు సీపీఐ సంపూర్ణ మద్దతు



మాట్లాడుతున్న సత్యప్రసాద్

మల్లాపూర్: బీసీ రిజర్వేషన్ల సాధనకు వివిధ సంఘాలతో ఏర్పడిన బీసీ ఐక్య కార్యాచరణ కమిటీ (బీసీ–జేఏసీ) 'బంద్ ఫర్ జస్టిస్' పేరుతో 18న తలపెట్టిన రాష్ట్రబంద్‌కు సీపీఐ ఉప్పల్ మండల సమితి సంపూర్ణ మద్దతు తెలుపుతూ.. బంద్‌లో ప్రత్యక్షంగా పాల్గొంటామని, సీపీఐ ఉప్పల్ మండల సమితి కార్యదర్శి సత్యప్రసాద్, సహాయ కార్యదర్శి బషీర్ అలీ అన్నారు. ఏఐవైఎఫ్ మేడ్చల్ జిల్లా ఉపాధ్యక్షులు గిరిబాబు, సీపీఐ నాచారంశాఖ కార్యదర్శి కృపాకర్, సీపీఐ ఉప్పల్ మండల కౌన్సిల్ సభ్యులు రజిని, శోభ, ఏఐవైఎఫ్ నాయకులు వికాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యూజీడీ సమస్యకు శాశ్వత పరిష్కారం



పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ శ్రీవాణి

రామంతాపూర్: డివిజన్ కార్పొరేటర్ బండారు శ్రీవాణివెంకట్‌రావు గురువారం ఇందిరానగర్ శేఖర్ బస్తీలో భూగర్భడ్రైనేజీ పనులను ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. డివిజన్ పరిధిలోని ఇందిరానగర్, శేఖర్‌బస్తీ మొదలుకుని నేతాజీనగర్ వరకు అస్తవ్యస్తంగా ఉన్న భూగర్భ డ్రైనేజీ వ్యవస్థతో మురుగు రోడ్లపై ప్రారంభించడమే కాకుండా చిన్న చెరువులోకి చేరి దుర్వాసన వెదజల్లుతుందన్నారు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని భూగర్భ డ్రైనేజీకి శాశ్వత పరిష్కారం చూపిస్తామని ఆమె పేర్కొన్నారు. జలమండలి మేనేజర్ రవీందర్‌గౌడ్, కిషన్, స్వర్ణషిండే తదితరులు పాల్గొన్నారు.

పన్నుల శాతం తగ్గించేశారు !

కేంద్రంపై సీపీఐ తీవ్ర ఆరోపణలు



సమావేశంలో మాట్లాడుతున్న వీఎస్ బోస్

కాప్రా: కేంద్ర ప్రభుత్వం దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు దోచిపెడుతోందని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వీఎస్ బోస్ ఆరోపించారు. గురువారం కమలానగర్‌లోని పార్టీ కార్యాలయం నీలం సంజీవరెడ్డి భవన్‌లో మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా సమితి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గడిచిన 12 ఏళ్లలో బడా కార్పొరేట్ శక్తులకు రూ.15 లక్షల కోట్ల దేశ సంపదను కేంద్రం దోచిపెట్టిందని దుయ్యబట్టారు. గతంలో ప్రభుత్వానికి 37శాతం పన్ను కడితే బీజేపీ హయాంలో 16శాతానికి తగ్గించారని పేర్కొన్నారు. దీంతో దేశ సంపదకు రూ.9 లక్షల కోట్లు నష్టం వాటిల్లిందన్నారు.

పోరాటాలకు సిద్ధం

మేడ్చల్– మల్కాజ్‌గిరి జిల్లాలో అనేక సమస్యలు న్నాయని.. వీటిని మండలాల వారీగా గుర్తించి పోరాటలకు సిద్ధమవుతున్నట్లు సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యులు ఉమామహేష్ అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీలో ఉండి ప్రజాసమస్యల పరిష్కారమే తమ పార్టీ ప్రధాన అజెండాగా ముందుకెళ్తామన్నారు. సీపీఐ నేతలు సాయిలు, దామోదర్‌రెడ్డి, స్వామి, శంకర్, లక్ష్మి, కిషన్, హరినాథ్, శ్రీనివాస్, సత్యప్రసాద్, కృష్ణ, నర్సింహ, దశరథ్, యాదయ్య, యాదగిరి, పరమేశ్వర్, మాధవి తదితరులు పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలి



సీసీరోడ్డు పనులను పరిశీలిస్తున్న నాచారం కార్పొరేటర్ శాంతి

మల్లాపూర్: నాచారం వీఎస్టీ స్నేహపురికాలనీలో రూ.20 లక్షలతో జరుగుతున్న సీసీరోడ్డు పనులను గురువారం నాచారం కార్పొరేటర్ శాంతి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రోడ్డు పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని సూచించారు. పనులను సకాలంలో పూర్తిచేయాలన్నారు. ఏఈ వినిత్, వర్క్ ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్, బీఆర్‌ఎస్‌నేత సాయిజెనీశేఖర్, చంద్రశేఖర్, సువర్ణ, సుగుణాకర్‌రావు, వాసు, రోహిత్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసులకు వైద్య శిబిరం

కుషాయిగూడ: కుషాయిగూడ పోలీస్‌స్టేషన్‌లో తులసి లైఫ్‌లైన్ ఆసుపత్రి ఆధ్వర్యంలో వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కుషాయిగూడ పోలీసులు, సిబ్బందికి పలు వైద్య పరీక్షలతో పాటు కంటి, దంత, కార్డియాక్ వంటి పరీక్షలు నిర్వహించి వైద్యులు తగిన సూచనలు సలహాలు చేశారు. ఎస్‌బీఐ లైఫ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ వైద్య శిబిరంలో ఇన్‌స్పెక్టర్ భాస్కర్‌రెడ్డి, ఎస్ఐలు సుధాకర్‌రెడ్డి, శ్రీనివాస్, వెంకన్న, సునీల్‌రెడ్డి, సాయిలు, సతీష్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.



వైద్యపరీక్షలు చేయించుకుంటున్న ఇన్‌స్పెక్టర్ భాస్కర్‌రెడ్డి

ప్రారంభమైన జాతీయస్థాయి వర్క్‌షాప్



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న యూనివర్సిటీ వీసీ, ఇతర ప్రతినిధులు

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మ గూడలోని మల్లారెడ్డి యూనివర్సిటీలో మూడ్రోజుల పాటు నిర్వహించనున్న జాతీయస్థాయి వర్క్‌షాప్ గురువారం ప్రారంభమైంది. ఎమ్మార్‌యూ పరిధిలోని స్కూల్ ఆఫ్ అలైడ్ అండ్ హెల్త్‌కేర్ సైన్సెస్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్, మల్లారెడ్డి క్యాన్సర్ ఆసుపత్రి అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో ఐసీఎంఆర్, డీహెచ్‌ఆర్ సహకారంతో మూడ్రోజుల పాటు నెక్స్‌జెన్ ఏఐ ఇన్ హెల్త్‌కేర్ ఫ్రమ్ ప్రీడిక్షన్ టూ ప్రిస్క్రిప్షన్ థెరపీ అనే అంశంపై వర్క్‌షాప్ సాగనుంది. రిజిస్ట్రార్ శ్రీనివాస్‌రావు, కన్వీనర్ అపర్ణ, వినోద్‌కుమార్, సుధారమణ, అనీల్‌కౌల్, రాజేందర్‌రావు, సంగీత, జీవీరావు పాల్గొన్నారు.

డీసిల్టింగ్ పనులు పూర్తి చేయాలి

మల్కాజిగిరి: బాలసరస్వతీనగర్‌లో కార్పొరేటర్ శ్రవణ్ పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులను వరదముంపు గురించి ఆరాతీశారు. ఈ సందర్భంగా జీహెచ్‌ఎంసీ అధికారులకు పలు సూచనలు చేశారు. నాలాను హైడ్రా అధికారులతో సమన్వయం చేసి త్వరితగతిన డీసిల్టింగ్ చేయించాలన్నారు. ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయడానికి జలమండలి అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని తెలిపామన్నారు. నాలాల్లో చెత్త,చెదారం వేయకుండా ప్రజలు కూడా భాధ్యతగా వ్యవహరించాలన్నారు. పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

శ్మశానవాటికలో అభివృద్ధి పనులు

కుషాయిగూడ: మీర్‌పేట్–హెచ్‌బీకాలనీ డివిజన్, లక్ష్మీనగర్‌లోని హిందూ, క్రైస్తవ శ్మశానవాటికలో కార్పొరేటర్ ప్రభుదాస్ ఆధ్వర్యంలో గురువారం క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. దీపావళి, ఆల్‌సోల్స్‌డేను పురస్కరించుకుని నిర్వహించే పూజల నేపథ్యంలో శ్మశానవాటికలో శుభ్రత కార్యక్రమాన్ని చేపట్టి చెత్త,చెదారం ఎత్తేసినట్లు కార్పొరేటర్ తెలిపారు. తమ పూర్వీకులను స్మరించుకుంటూ.. సమాధులవద్ద దీపాలు వెలిగించేందుకు వచ్చే వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా తగిన చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు.

రాష్ట్రస్థాయి కబడీ పోటీలకు ఎంపిక



వర్షిత్‌రెడ్డి

కాప్రా: రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు కాప్రా విజయస్కూల్‌కు చెందిన ఆర్.ఆర్.వర్షిత్‌రెడ్డి ఎంపికయ్యారు. రంగారెడ్డిజిల్లా సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో జరిగిన ఉమ్మడి రంగారెడ్డి జిల్లా స్థాయి అండర్–14 కబడ్డీ పోటీలు జరిగాయి. రంగారెడ్డి, వికారాబాద్, మేడ్చల్– మల్కాజ్‌గిరి జిల్లా జట్లు పోటీపడగా.. జిల్లా రెండోస్థానంలో నిలిచింది. ఇందులో వర్షిత్‌రెడ్డి అత్యుత్తమ ప్రతిభను కనబర్చడంతో రాష్ట్రస్థాయికి ఎంపిక చేశారు. విజయ స్కూల్ నుంచి ఎంతో మంది విద్యార్థులు జిల్లా స్థాయి, రాష్ట్ర స్థాయి క్రీడల్లో పాల్గొని మంచి ప్రతిభను కనబరిచారని పేర్కొన్నారు. విద్యార్థిని ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రులు ప్రదీప్‌రెడ్డి, స్వాతిని పాఠశాల యాజమాన్యం తరపున అభినందిస్తున్నామన్నారు.

మహిళలకు చేయూతనందిస్తాం

మల్కాజిగిరి: డివిజన్ పరిధిలోని మహిళలకు చేయూతనందిస్తామని మాజీ కార్పొరేటర్ జగదీష్‌గౌడ్ అన్నారు. గురువారం ఎస్పీనగర్ మహిళాభవన్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన మహిళా సమైక్య గ్రూపు సభ్యులకు చేయూతనందించడానికి రూ.లక్ష విరాళం అందజేశారు. జగదీష్‌గౌడ్ మాట్లాడుతూ.. గతనెల ఎమ్మెల్యే రూ.2.5లక్షలు అందజేశారన్నారు. వాటిలో కుట్టు శిక్షణకేంద్రం ఏర్పాటు చేసి మహిళలకు చేయూతనందిస్తామన్నారు. ప్రేమలత, చంద్రకళ, లలిత, శారద, జయశ్రీ, వసంత, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి



ఓపెన్‌జిమ్‌కు శంకుస్థాపన చేస్తున్న కమిషనర్ శైలజ

బోడుప్పల్: మౌలిక వసతుల కల్పనకు దశలవారీగా కృషి చేస్తున్నట్లు బోడుప్పల్ కమిషనర్ శైలజ అన్నారు. చెంగిచర్ల 1వ డివిజన్ పరిధిలోని క్రాంతి కాలనీలో పార్కులో బీపీఎల్ సంస్థ ద్వారా ఓపెన్ జిమ్ ఏర్పాటుకు ఆమె గురువారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రజల ఆరోగ్య అవసరాలను దృష్టిలో ఉంచుకుని పార్కులు, ఓపెన్‌జిమ్‌లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. దైనందిన జీవితంలో వ్యాయామం ఒక భాగమన్నారు. ప్రస్తుతం ప్రారంభించిన పనులను త్వరితగతిన పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. మాజీ కార్పొరే టర్లు బింగి జంగయ్యయాదవ్, కొత్త చందర్‌గౌడ్, బీ– బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిశోర్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కొత్త ప్రభాకర్‌గౌడ్, నేతలు కొత్త రవిగౌడ్, రంగ బ్రహ్మన్నగౌడ్, కొత్త సుశాంత్‌గౌడ్ పాల్గొన్నారు.

రూ.13లక్షలతో యూజీడీ పనులు



యూజీడీ పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ సునీత

మౌలాలి: డివిజన్ పరిధిలోని పూలపల్లి బాలయ్య, సూర్యానగర్ కాలనీలో రూ.13 లక్షలతో చేపట్టనున్న భూగర్భ మురుగు నీటిపారుదల వ్యవస్థ పనులను గురువారం స్థానిక కార్పొరేటర్ గున్నా సునీతాశేఖర్‌యాదవ్ ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ.. మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ సహకారంతో నిధులు మంజూరయ్యాయని, పనులు త్వరగా పూర్తయ్యేలా తగిన చర్యలు తీసుకుంటామన్నారు. చాలా ఏళ్లుగా కాలనీవాసులు ఎదురుచూస్తున్న సమస్యకు పరిష్కారం లభించనుందని తెలిపారు. సాయిబాబు, పాండురంగ గుప్తా, రామకృష్ణ, మల్లేశ్వరరావు, అశోక్, శ్రీనివాస్, నాగరాజు తదితరులున్నారు.


యువత సమాజ అభివృద్ధికి కృషి చేయాలి

హెచ్‌పీఎస్‌లో విద్యార్థి దినోత్సవం



రామంతాపూర్: హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో లయన్స్‌క్లబ్ ఇంటర్నేషనల్ గ్లోబల్ వీల్ ఫౌండేషన్ ఐఐటీ అల్యూమినీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్‌కలాం జయంతి ఉత్సవాల్లో భాగంగా విద్యార్థి దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. యువత విద్యార్థులు అబ్దుల్‌కలాంను ఆదర్శంగా తీసుకుని సేవాభావంతో సమాజ నిర్మాణంతో పాటు సమాజ అభివృద్ధికి కృషిచేయాలని సూచించారు. క్వాలిటీ సర్కిల్ ఫోరమ్ ఆఫ్ ఇండియా చైర్మన్ శ్యామ్‌మోహన్ గ్లోబల్ వీల్ ఫౌండేషన్ డైరెక్టర్ ఏపీ.కృష్ణమూర్తి, లైన్స్‌క్లబ్ నారాయణ, డాక్టర్ నరసింహ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'బీసీ బంద్' పోస్టర్ ఆవిష్కరణ



నాచారంలో బంద్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నేతలు

మల్లాపూర్: బీసీ రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు నాచారం అంబేడ్కర్ విగ్రహం వద్ద గురువారం నేతలు 18న బంద్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 42 శాతం బీసీ రిజర్వేషన్ అమలు చేసేంత వరకు ఉద్యమం ఆగదన్నారు. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు బుదాని సదానందం, టీయూజేఏసీ చైర్మన్ నల్లా రాధాకృష్ణ, కనుకుంట్ల విజయ్‌కుమార్, నల్లబాబు, రాజుగౌడ్, నందికొండ శ్రీనివాస్‌రెడ్డి, ప్రమోద్‌మహరాజ్, అఖిలేష్, హరిబాబు, గణేష్‌గౌడ్, రాంచందర్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

బంద్‌ను విజయవంతం చేయాలి...

అల్వాల్: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని ఈనెల 18న చేపట్టనున్న రాష్ట్రవ్యాప్త బంద్‌ను విజయవంతం చేయాలని తెలంగాణ జనసమితి నాయకులు పిలుపునిచ్చారు. గురువారం అల్వాల్‌లో నిర్వహించిన సమావేశంలో జన సమితి నాయకులు మాట్లాడుతూ.. పార్టీలకు అతీతంగా బీసీ బంద్‌కు అందరు సహకరించాలని కోరారు. జన సమితి మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా ప్రధాన కార్యదర్శి దయాకర్, జిల్లా నాయకులు శ్రీనివాస్, రవికుమార్, సతీష్‌కుమార్, రమేష్, తెలంగాణ ఉద్యమకారుల ఫోరం మల్కాజిగిరి అధ్యక్షుడు కృష్ణ, బీసీ నాయకులు సురేష్ కుమార్, వెంకటేష్, రాజు, గిరిబాబు, సంగమేష్ తదితరులు పాల్గొన్నారు.